# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 29-06-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జూలై ఒకటో తేదీన తాడేపల్లి మండలం పెనుమాకలో లబ్ధిదారులకు స్వయంగా పింఛన్లను అందజేయనున్నారు
- ❖రేషన్ సరకుల అక్రమాలపై సీఐడీ విచారణ జరిపిస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.
- ❖పురుషుల టీ-20 క్రికెట్ ప్రపంచ కప్ లో భాగంగా బ్రిడ్జిటౌన్ వేదికగా భారత్ -దక్షిణాఫ్రికా జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ ఈ రోజు రాత్రి 8 గంటలకు జరగనుంది.
- ❖ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" కార్యక్రమం 111వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది.
- ❖ఉత్తర ఒడిశా తీర సమీపంలోని బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం వెల్లడిచింది.

===========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తాడేపల్లి మండలం పెనుమాకలో జూలై ఒకటో తేదీన లబ్ధిదారుల ఇంటికి వెళ్లి స్వయంగా పింఛన్లను అందజేయనున్నారు. పింఛన్ల పంపిణీల్లో భాగంగా పెనుమాకలోని లబ్ధిదారుల జాబితాను అధికారులు సేకరించి, పరిశీలిస్తున్నారు. కాగా ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం పింఛనును వెయ్యి రూపాయలకు పెంచి 4 వేల రూపాయలను లబ్ధిదారుల ఇళ్ల వద్దే పంపిణీ చేయనుంది. పెంచిన పెన్షన్ ఏప్రిల్ నుంచే అమలు చేస్తూ... మూడు నెలల బకాయిలనూ కలిపి జూలై ఒకటో తేదీన 7 వేల రూపాయలను అందించనుంది. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

===========================

రేషన్ సరకుల అక్రమాలపై పూర్తిస్థాయి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. పౌరసరఫరాల శాఖపై కాకినాడలో రెండో రోజు నిర్వహించిన సమీక్షలో ఆయన

మాట్లాడుతూ, కాకినాడ పోర్టు నుంచి ఇతర దేశాలకు రేషన్ సరకులు వెళ్తున్నాయని, ఈ అవకతవకలపై సీఐడీ విచారణ కోరతామని తెలిపారు. టోల్‌గేట్‌ల వద్ద సీసీ కెమెరాల ఆధారంగా విచారణ జరుపుతామన్నారు. కాకినాడలో తొలిరోజు తనిఖీల్లో 6 గోదాముల్లో 7 వేల 615 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేశామన్నారు. కాకినాడలో ఒక వ్యవస్థీకృత మాఫియా ఏర్పడిందని, వీటిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి తెలియజేశారు.

=============================

చట్టసభ గౌరవాన్ని కాపాడేందుకు స్పీకర్ గా తన వంతు బాధ్యతను నెరవేరుస్తానని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసన సభ సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. సభాపతిగా ఎన్నికై బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి ఈరోజు ఆయన విశాఖపట్టణం వచ్చారు. ఆయనకు విమానాశ్రయంలో జిల్లా ఇన్‌ఛార్జ్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్, అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి సహా పలువురు అధికారులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ... అతి చిన్న వయసులో ఎన్టీఆర్ తనకు మంత్రి పదవి ఇచ్చారని, ఇప్పుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పీకర్ పదవి ఇవ్వడం ఎంతో ఆనందంగా వుందన్నారు. తనకు అప్పగించిన బాధ్యతను నిబంధనలకు అనుగుణంగా నెరవేర్చి శాసనసభాపతి పదవికి వున్న హుందాతనాన్ని పెంచుతానని అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు.

=============================

పురుషుల టీ-20 క్రికెట్ ప్రపంచ కప్ లో భాగంగా బార్బడోస్ లోని బ్రిడ్జిటౌన్ వేదికగా భారత్-దక్షిణాఫ్రికా జట్ల మధ్య ఈ రోజు ఫైనల్ మ్యాచ్ జరగనుంది. భారత కాలమానం ప్రకారం ఈరోజు రాత్రి 8 గంటలకు మ్యాచ్ ప్రారంభం కానుంది. కాగా 2007 టీ-20 ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్ లో భారత్, పాకిస్థాన్ పై విజయం సాధించి టైటిల్ ను కైవసం చేసుకుంది.

=============================

ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ నాలుగు జాతీయ నాణ్యత హామీ ప్రమాణాల అవార్డులను కైవసం చేసుకుంది. రాష్ట్రంలోని నాలుగు ఆరోగ్య సంరక్షణ సదుపాయాలు ఈ జాతీయ స్థాయి పురస్కారాల కోసం ఎంపికయ్యాయి. కేంద్ర వైద్య ఆరోగ్య శాఖామంత్రి జె.పి. నడ్డా చేతుల మీదుగా ఈ అవార్డుల్ని అందుకోవడం పట్ల ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ సంబంధిత అధికారుల్ని ఈరోజు అభినందించారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖకు ప్రజల్లో గుర్తింపు లభించేలా అంకిత భావంతో పని చేయాలని వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ కోరారు.

=============================

గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న సమస్యలను ప్రణాళికా ప్రకారం పరిష్కరిస్తామని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖల సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరులో పర్యటించిన ఆయన ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిలోని సమస్యలపై జిల్లా కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులతో ఆయన సమీక్షించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ... ఏసిలు, ఎలివేటర్లు పని చేయకపోవటం, రోగులు వైద్య పరీక్షలు బయట చేయించాల్సి రావటం వంటి పలు అంశాలపై చర్చించామని, వీటిపై రూట్ మ్యాప్ తయారు చేశామని తెలిపారు. నూతన భవనాల నిర్మాణం, మౌలిక సదుపాయాల ఏర్పాటు వంటి సమస్యలతో పాటు అన్నింటినీ ప్రణాళిక ప్రకారం పరిష్కరిస్తామని కేంద్ర మంత్రి వివరిస్తూ...

(వాయిస్ 27 సెకన్లు)

విరామం

=============================

ఎన్టీఆర్ భరోసా పించన్ల పంపిణీని జులై 1వ తేదీన 90 శాతానికి పైగా పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఈరోజు విజయవాడలో జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన దృశ్యమాధ్యమ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... జులై 1వ తేదీన 65 లక్షల 18 వేల 496 మందికి గ్రామ, వార్డు సచివాలయాల

సిబ్బంది ద్వారా ఫించన్లు పంపిణీకి 4 వేల 399.89 కోట్ల రూపాయలను విడుదల చేసినట్లు తెలిపారు. ఫించన్లు పంపిణీ ప్రక్రియను జిల్లా కలెక్టర్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని నీరభ్ కుమార్ ప్రసాద్ ఆదేశించారు.

============================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్ - మనసులో మాట” కార్యక్రమం 111వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ఆకాశవాణి ద్వారా ప్రసారమవుతుంది. ప్రధాన మంత్రిగా వరుసగా మూడోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత జరగనున్న తొలి “మన్ కీ బాత్” కార్యక్రమం ఇది. ఈ కార్యక్రమం ఆకాశవాణి, దూరదర్శన్ నెట్ వర్క్‌లు, ఏఐఆర్ న్యూస్ వెబ్ సైట్ ద్వారా న్యూస్ ఆన్ ఎయిర్ మొబైల్ యాప్‌లో ప్రసారం కానుంది. మన్ కీ బాత్ హిందీ ప్రసంగం ప్రసారమైన వెంటనే అన్ని ఆకాశవాణి ప్రాంతీయ భాషల్లో దీని అనువాదం ప్రసారం అవుతుంది.

============================

ఉత్తర ఒడిశా తీర సమీపంలోని బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం వెల్లడిచింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. అలాగే రుతుపవనాలు చురుగ్గా మారడంతో ఉత్తర కోస్తాలో భారీ వర్షాలతో పాటు, గంటకు 55 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని, మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదని అధికారులు సూచించారు.

(వాయిస్ 29 సెకన్లు)

అలాగే పార్వతీపురం మన్యం, అల్లూరి, కాకినాడ, కోనసీమ, ఏలూరు, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, కృష్ణా, ఎన్టీఆర్, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, నంద్యాల, కడప, చిత్తూరు, ఉభయ గోదావరి జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలు కురుస్తాయని తెలిపింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది.

============================

తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ నేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ) మాజీ అధ్యక్షులు ధర్మపురి.శ్రీనివాస్ మృతి పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయడు సంతాపం తెలిపారు. సుదీర్ఘ కాలం రాజకీయాల్లో ఉన్న డి.శ్రీనివాస్ మంత్రిగా, పార్లమెంట్ సభ్యునిగా తనదైన ముద్ర వేశారని అన్నారు. ఆయన మరణం దిగ్భ్రాంతిని కలిగించిందని పేర్కొన్నారు. హుందా రాజకీయాలతో తాను నమ్మిన సిద్ధాంతం కోసం శ్రీనివాస్ పని చేశారని అన్నారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

============================

రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ జులై 1 నుంచి మూడు రోజుల పాటు కాకినాడ జిల్లాలో పర్యటించనున్నారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారి జిల్లా పర్యటన నేపధ్యంలో ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. ఈరోజు వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఉప ముఖ్యమంత్రి జులై 1 నుండి 3వ తేదీ వరకూ పిఠాపురం నియోజక వర్గంలోను, కాకినాడ లోను పర్యటిస్తారని తెలిపారు. ఆయన జులై 1వ తేదీన గొల్లప్రోలులో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని వెల్లడించారు.

============================
============================